క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు

కనిగిరిరూరల్: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు ఎస్కే అహ్మద్ షరీఫ్ తెలిపారు. శిక్షణ తరగతులకు 6వ తరగతి నుంచి 10వ తరగతి లోపు విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్, క్యారమ్స్ తదితర అంశాలను ఈ శిక్షణ తరగతుల్లో నేర్పిస్తామన్నారు. విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న ఫ్యాకల్టీలు తమ సేవలు అందించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టంగుటూరు: స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు వర్ధన్‌రాజు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 6వ తేదీ వరకు విద్యార్థులకు కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు, డ్రాయింగ్, పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గ్రంథాలయాలకు పంపాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు



పొన్నలూరులో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికాకుడదని ఎస్సై అనూక్ అన్నారు. పొన్నలూరులో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురిపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు సంభవించి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటారన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఆటో డ్రైవర్లు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకపోతే కేసులు తప్పవన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడు గంధం రిఫానియల్

పామూరు: బ్రిడ్జి సైడ్ వాల్ ఢీకొని మోటార్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని భూమిరెడ్డిపల్లె సమీపాన 567 జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. భూమిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గంధం రిఫానియల్ పొలంలో ఉంటున్న మేకలు, గొర్రెల కాపరికి భోజనం తీసుకువెళుతుండగా బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన బ్రిడ్జిసైడ్‌వాల్‌ను ఢీకొని బైక్ కిందపడిపోయింది. ఘటనలో రిఫానియల్ తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న 1033 జాతీయరహదారి అంబులెన్స్ వాహనం పైలెట్ పైడాల వెంకటరెడ్డి, ఈఎంటీ ఎ.సువర్ణలు క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేసి పామూరు సీహెచ్‌సీకి తరలించారు. పామూరులో చికిత్స అనంతరం డాక్టర్ల సలహా మేరకు క్షతగాత్రునిగుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

బర్లీ పొగాకు రైతులను ఆదుకోండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా రైతు సంఘం ప్రతినిధులు

టంగుటూరు: బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా రైతు సంఘ ప్రతినిధులు మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని కోరారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు గతేడాది బర్లీ పొగాకుకు మంచి ధర ఉండడంతో ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున సాగు చేశారని, కానీ ప్రస్తుతం ధరలు తక్కువగా ఉండడంతో రైతులు ఆందోళనలో ఉన్నారని, రైతులను ఆదుకోవాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ రైతుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు.

4న ఉచిత సున్తీ కార్యక్రమం

కనిగిరిరూరల్: కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మే నెల 4న ఉచిత సున్తీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేఎస్ఎం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పామూరు రోడ్డులోని ఎన్జీవో భవన్ ప్రాంగణంలో చిన్నారులకు ఉచితంగా సున్తీ చేస్తామన్నారు. సున్తీ చేయించుకోదలచిన చిన్నారుల పేర్లను, వివరాలను మే 2వ తేదీ లోగా ఆయా ప్రాంతాల్లోని మసీదుల్లో లేదా 9441786 390, 9441744050 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

పచ్చ నాయకుల పిచ్చి చేష్టలు !

- మాకు కమీషన్ ఇస్తేనే పనులు చేయనిస్తాం
- అడవిరాజుపాలెంలో మంచినీటి పైప్‌లైన్‌కు అడ్డుతగులుతున్న టీడీపీ నాయకులు
- గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు ఇప్పుడు టీడీపీ నాయకుల బెదిరింపులు
- 90 శాతం పనులు పూర్తి, 10 శాతం పనులు చేయకుండా నిలుపుదల
- గ్రామంలో మంచినీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

కందుకూరు:

తెలుగుదేశం పార్టీ నాయకుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తమ స్వప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గుడ్లూరు మండలం అడవిరాజుపాలెంలో చోటు చేసుకున్న ఘటనే ఇందుకు నిదర్శనం. ఒకపక్క గుక్కెడు నీరు లేక గ్రామస్తుల గొంతెండుతున్నా అక్కడి టీడీపీ నాయకులు మాత్రం కమీషన్లతో తమ చేతులు తడపాల్సిందేనంటూ తాగునీటి పైప్‌లైన్ పనులను అడ్డుకుంటున్నారు. దీంతో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అదేమంటే మాకు ఎమ్మెల్యే చెప్పాడు.. అందుకని మా పనులు చేయనీయమంటూ బహిరంగంగానే చెప్తుండడం అక్కడి నాయకుల బరితెగింపుకు మరో నిదర్శనం.

మాకు ఎమ్మెల్యే చెప్పాడు..

గుడ్లూరు మండలం అడవిరాజుపాలెం గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలకు తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.37 లక్షల నిధులు గత ప్రభుత్వంలోనే మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామ సర్పంచ్ గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించడంతో పాటు, కొంత పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. దాదాపు 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం ఇంకా 10 శాతం పనులు చేయాల్సి ఉంది. ఓవర్‌హెడ్ ట్యాంకు సమీపంలోని బావి నుంచి నీటి కనెక్షన్ ఇవ్వడంతో పాటు, ఎస్సీ, బీసీ కాలనీలకు పైప్‌లైన్ వేసి నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఈ పనులు చేసేందుకు ఇటీవల జేసీబీలతో పనులు ప్రారంభించారు. అయితే వెంటనే అక్కడి చేరుకున్న ఇరువురు టీడీపీ నాయకులు పనులను అడ్డుకున్నారు. మా అనుమతి లేకుండా ఇక్కడ పనులు



గ్రామంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

> **అధికారులకు ఫిర్యాదు చేశాం..**
> గ్రామానికి తాగునీటిని అందించే పనులను దాదాపు 90 శాతం పూర్తి చేశాం. ఇంకా 10 శాతం పనులను మాత్రమే చేయాల్సి ఉంది. ఆ పనులు జరగకుండా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులే అడ్డుకుంటున్నారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశాను. అయినా పనులు ముందుకు సాగడం లేదు. దీని వల్ల వేసవిలో తాగునీటి వసతి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.
> — పీ. నాగేశ్వరరావు, సర్పంచ్ భర్త

చేయడానికి వీలు లేదని, మాకు ఎమ్మెల్యే చెప్పాడు కాబట్టి పనులు అడ్డుకుంటున్నాం అంటూ పనులు చేస్తున్న వారిపై దౌర్జన్యానికి దిగారు. దీంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి.

గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు..

ఆ తరువాత తిరిగి ఎన్నిసార్లు పనులు చేసేందుకు



మధ్యలోనే నిలిచిపోయిన పైప్‌లైన్ నిర్మాణ పనులు



వృథాగా పడివున్న పైప్‌లు

ప్రయత్నం చేసినా ఆ ఇరువురు టీడీపీ నాయకులు మాత్రం పనులు చేసేందుక ససేమిరా అంటున్నారు. అదే మంటే తమకు పనుల్లో కమీషన్ ఇస్తేనే పనులు చేసుకోనిస్తామంటూ దౌర్జన్యానికి దిగుతున్నారు. దీంతో చేసేదేమి లేక వారి బెదిరింపులకు తలొగ్గి పనులు నిలిపివేయాల్సి వచ్చింది. గ్రామంలో నీటి వసతి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో బిందెడు నీటి కోసం అల్లాడుతున్నారు. ప్రస్తుతం ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకుని నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నారు. అదే పైప్‌లైన్ పనులు పూర్తైతే ఇంటికి నీటిని అందించే అవకాశం ఉంటుంది. కాని టీడీపీ నాయకుల పుణ్యమా అంటూ ఆ వెసులుబాటు లేకుండా పోయింది.

ఘనంగా ఆదిమూలపు సురేష్ పుట్టినరోజు వేడుకలు

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం పార్టీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువా, గజమాలలతో సత్కరించారు. పార్టీ జరుగుమల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 60 కేజీల భారీ కేక్‌ను ఆదిమూలపు సురేష్ కట్ చేశారు. వేడుకలకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి తమ అభిమాన నాయకుడికి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలలో నూతనోత్సాహం పెల్లుబికింది. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే రానున్న ఎన్నికల్లో కొండపిలో జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షులు మసనం వెంకట్రావు, పిన్నిక శ్రీనివాసులు, దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, చింతపల్లి హరిబాబు, బచ్చల కోటేశ్వరరావు, ఇనకొల్లు సుబ్బారెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ వేముల కిరణ్‌కుమార్, రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తాటికొండ రామచంద్రరావు, మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్‌రియాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు దాకా పిచ్చిరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదిమూలపు సురేష్‌ను సత్కరిస్తున్న మండల పార్టీ అధ్యక్షులు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

సింగరాయకొండ: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షునిగా నియమితులైన మసనం వెంకట్రావు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మసనం వెంకట్రావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల బాధ్యతలు అప్పగించిన సురేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు యనమల మాధవి, షేక్ కరీం, పెరికాల సునీల్, సయ్యద్ ఆబిద్‌అలీ, షేక్ మస్తాన్,షేక్ అల్లాభక్షు, కుంచాల సాయివేణు, తదితరులు పాల్గొన్నారు.



సురేష్‌కు స్వీటు తినిపిస్తున్న మసనం వెంకట్రావు

కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న జీవీ కొండారెడ్డి

కనిగిరిరూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సీఐటీయూ జిల్లా జీవీ కొండారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ సమావేశం పీసీ కేశవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ పోరాటాలతోనే కార్మికుల సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కాల రాస్తున్నాయని తీవ్రంగా ధ్వజమెత్తారు. మే ఒకటవ తేదీన మేడే దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరేంద్ర, బషీరా, ఏడుకొండలు, యు పిచ్చయ్య, సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అడిగిన వారందరికీ పని కల్పించండి

టంగుటూరు: గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అడిగిన వారందరికీ పని కల్పించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఉపాధి హామీ, డ్వాక్రా అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం అమలు తీరు, చేపడుతున్న పనులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. అర్హులందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పని దినాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులు కల్పించేందుకు ఎక్కువ అవకాశం పనులపై దృష్టి సారించాలని, ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలను పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద రైతులకు పంపిణీ చేసే మొక్కల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం నిబంధనలను పాటిస్తూ పనులను చేపట్టాలని, లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల ఏపీఎంలు, ఏపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



తూర్పు నాయుడుపాలెంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

పామూరు: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పలువురికి ఆర్థికసాయం చేశారు. సంస్థ అధ్యక్షుడు యం.ముసలయ్య, సభ్యులు వెండిదండి వెంకటేశ్వరరెడ్డిలు గోపాలపురం గ్రామానికి చెందిన డయాలసిస్ చేయించుకుంటున్న పందిటి పెదమాలకొండయ్యకు రు.5 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న షేక్.బేగంకు రూ.7500, రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మొత్రావుల పాడుకు చెందిన శ్రీరామ్ మణివర్ధన్‌కు రూ.5 వేలు, శ్రీరాం మనోహర్‌కు రూ.5 వేల ఆర్థికసాయం అందించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన

కనిగిరిరూరల్: ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓ యువీ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక గోమతి హైస్కూల్‌లో పది పరీక్షల్లో 593 మార్కులతో ప్రతిభ చాటిన విద్యార్థులు తమటం గోవర్ధన్‌రెడ్డి, తుమ్మా కార్తీక్‌రెడ్డిలను ఆదివారం అభినందించారు. ఈమేరకు వారిద్దరికి రూ.10 వేలు, 588 మార్కులు సాధించిన ఎస్కే నఫీజాకు రూ.7వేలు, 586 మార్కులు సాధించిన ఏ సిసింద్రిరెడ్డికి రూ. 5వేలను కరస్పాండెంట్ బాలు ప్రసాద్ రెడ్డి ప్రోత్సాహక నగదును ఇవ్వగా.. వాటిని ఎంఈఓల చేతుల మీదుగా విద్యార్థులకు అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, గౌరవ సలహాదారుపీవీఎన్‌మురళీధర్,ఉపాధ్యాయులుపాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేస్తున్న ఎంఈఓలు

అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌కు పుస్తకాల వితరణ

సింగరాయకొండ: కొండపి మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌కు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తన సొంత నిధులు రూ.1.05 లక్షల విలువైన 840 పుస్తకాలు, ర్యాక్‌లు ఆదివారం అందజేశారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ పుట్టినరోజున అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌కు పలువురు మేధావులు రచించిన విలువైన పుస్తకాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ పుస్తకాలు చదువుకుని విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ యువకులకు స్వయంగా పుస్తకాలు అందజేయగా వారు పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



అంబేడ్కర్ కాలనీ యువకులకు పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ సురేష్

మందుబాబులకు అడ్డాగా తహశీల్దార్ కార్యాలయం

పొన్నలూరు: పొన్నలూరు తహశీల్దార్ కార్యాలయం మందు బాబులకు అడ్డాగా మారింది. ప్రతి రోజూ కార్యాలయం సిబ్బంది విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తరువాత రాత్రి సమయంలో మందుబాబులు కార్యాలయం ఆవరణంలో మద్యం సేవిస్తున్నారు. అలాగే మద్యం సేవించిన తరువాత ఖాళీ సీసాలు అక్కడే వదిలి వెళ్తున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయం ఆవరణం అపరిశుభ్రంగా మారిపోతుంది. వివిధ పనులపై ప్రతి రోజూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా రాత్రి సమయంలో పోలీసులు గస్తీ ఏర్పాటు చేసి కార్యాలయం ఆవరణంలో అసాంఘీక కార్యాకలాపాలు జరగకుండా మందుబాబుల రాకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీ వాటర్ బాటిళ్లతో అపరిశుభ్రంగా కార్యాలయం ఆవరణ

భక్తిశ్రద్ధలతో అభిషేకం, గోపూజ



అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



గోపూజలో ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అభిషేకోత్సవం, గోపూజ, మహానివేదనం అర్చకులు మంకాల శివప్రసాద్ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. గోపూజ నిర్వహించారు. నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవ మూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

5 నుంచి మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

పామూరు: స్థానిక రుక్మిణ సత్యభామా సమేత శ్రీమదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పామూరులోని కులాలవారీ ఉభయదాతలు, కులాల పెద్దలు, భక్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ స్వామి బ్రహోత్సవాలు 2008 తరువాత 17 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్నామని, అందరూ కలిసి రావాలని కోరారు. మొదటిరోజు అంకురార్పణ బ్రాహ్మణ ఉభయం, రెండవరోజు శేషవాహనం చౌదరీ, మూడవరోజు హనుమంత సేవ, నాల్గవరోజు గరుడసేవ కాపులు, ఐదవరోజు తలంబ్రాలు ఆర్యవైశ్యులు, ఆరవరోజు రథోత్సవం రెడ్డి, ఆర్యకాపులు, మహారాజశ్రీయులు, ఏడవరోజు అశ్వవాహనము(పారువేట) ముదరాజు వాల్మీకులు, ఎనిమిదవరోజు ఏకాంతసేవ నాయీబ్రాహ్మణులు, తొమ్మిదవరోజు పొన్న మహోత్సవం నిర్వహించేందుకు నిశ్చయించినట్లు తెలిపారు. సమావేశంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్లు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయళ్ల నారాయణరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, పువ్వాడి రామారావు, కొండిశెట్టి రమణయ్య, పందిటి హరీష్, గుత్తి వెంకటరాజా, టి.నరసింహారావు, అర్చకులు నారాయణం సత్యబాబు, మహంకాళి శివప్రసాద్, అన్ని కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల నిర్వహణపై మాట్లాడుతున్న ఈఓ నరసింహబాబు

పట్టపగలే జామాయిల్ కర్ర చోరీ



కొండపి మార్కెటింగ్ యార్డు కార్యాలయానికి తలుపులు దగ్గరగా వేసి ఉన్న దృశ్యం

- నిద్రావస్థలో అధికారులు
- కొండపి వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో ఘటన

సింగరాయకొండ: మండల కేంద్రంలోని కందుకూరు రోడ్డులో ఉన్న కొండపి వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో ఆదివారం పట్టపగలు చుట్టుపక్కల కాలనీవాసులు యథేచ్ఛగా జామాయిల్ కర్ర కొట్టుకుని తీసుకుపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ యార్డులో లక్షలాది రూపాయల విలువైన జామాయిల్ చెట్లు, ఇతర రకాల చెట్లు ఉన్నాయి. కార్యాలయ సిబ్బంది తలుపులు దగ్గరకు వేసుకుని లోపల ఉన్నారు. వీరు లోపల ఏం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. వీరు కార్యాలయం లోపల ఉండగానే బయట మాత్రం సుమారు 20 మందికి పైగా కాలనీవాసులు జామాయిల్ కర్ర యథేచ్ఛగా కొట్టుకుని తరలించుకుపోయారు. ఒక్క సింగరాయకొండలోనే కాకుండా టంగుటూరులో మండల కాంప్లెక్స్ పక్కన ఉన్న మార్కెటింగ్ యార్డు స్థలంలో కూడా ప్రతిరోజు యథేచ్ఛగా జామాయిల్ కర్ర అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టినట్లు వ్యవహరిస్తున్నారని, ఒకవేళ అక్రమంగా తరలించే సమయంలో సిబ్బంది పట్టుకుంటే వారికి ముడుపులు ఇచ్చుకుని వెళుతుంటారన్న ఆరోపణలు వచ్చాయి. మార్కెటింగ్ యార్డుకు చెందిన విలువైన సంపదను కాపాడాల్సిన అధికారులు పట్టినట్టు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక సిబ్బంది మార్కెట్ వసూలు వ్యవహారంలో కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఒంగోలు వ్యవసాయ మార్కెటింగ్ యార్డు అధికారులు, సిబ్బంది, కొండపి మార్కెటింగ్ యార్డు సిబ్బంది సంయుక్తంగా టంగుటూరు టోల్ గేట్ వద్ద సెస్ వసూలు చేశారు. వీరు సెల్ వసూలు పేరుతో తమ ఇష్టం వచ్చినట్లు ధాన్యం లారీల వద్ద దోచుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వాస్తవానికి ఏ మార్కెట్ పరిధిలోని వారు వారి పరిధిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసుకుని సెస్ వసూలు చేసుకోవాలి. అయితే ఒంగోలు వారు కొండపి మార్కెటింగ్ శాఖ పరిధిలో సెల్ వసూలు చేయమేంటన్న ఆరోపణలు వస్తున్నాయి.అంతేకాక మార్కెటింగ్ యార్డు వారు ధాన్యం, ఆక్వా లారీల వద్ద సెల్ వసూలు చేసుకోవాలి తప్ప పశువుల లారీల వద్ద సెస్ వసూలు చేయటమేంటని పశువులను రవాణా చేసే లారీడ్రైవర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కావున ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శన ఆపి మార్కెటింగ్ శాఖ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



జామాయిల్ కర్రలు తీసుకుని వెళ్తున్న మహిళలు, యువకులు